22

# భూమి ఎప్పుడూ గుండ్రంగానే ఉంటుంది

ప్రతి ఏడాది, జనవరి ఒకటో తారీఖున కొత్త నిర్ణయాలు తీసుకోడం, ఆ తర్వాత వాటిని, సమయాన్ని బట్టి, అవసరాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి గట్టున పెట్టేయడం ఓ ఆనవాయితీ అయిపోయింది. సాధారణంగా ఈ నిర్ణయాల ఆయువు ఓ రోజు, మహా అయితే ఓ మూడురోజులు మాత్రమే ఉంటాయి. మరి పరిస్థితులు అలా వస్తున్నాయి. అది నా తప్పు కాదు.

ఈసారి అలా కాకూడదు. కొత్తగా ఉండాలి. డిఫరెంట్‌గా ఉండాలి. అది చిరకాలం బతకాలి. ఇంట్లో వాళ్లకి, నా మీద, నా తెలివితేటల మీద మంచి అభిప్రాయం లేదని నా అనుమానం. అందుకని ముందు, అంటే నేను మార్చుకోడం. ఇంట్లో వాళ్ళకి నచ్చేవిధంగా, ఇష్టపడే విధంగా ఉండటం. అందుకని సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్ మీద చాలా ఇంగ్లీషు పుస్తకాలు, కొన్ని తెలుగు (ఇంగ్లీషువే తెలుగులో ఉన్నవి) పుస్తకాలు చదవడం మొదలు పెట్టాను. వాటిల్లోని పాయింట్లన్నీ రాసుకున్నాను.

ఎవరైనా నా కలెక్షన్ చదివారంటే అనుకుంటారు మా కుటుంబం అవధుల్లేని ప్రేమతో నిండి ఉందని, అడ్మిరేషన్, అఫెక్షన్, అప్రీసియేషన్ లాంటి పదాలతో ఇంట్లో వాళ్ళతో బంధాలు, సంబంధాలు, అనుబంధాలు చాలా పటిష్టంగా ఉన్నాయని.

నిజానికి ఈ పాయింట్లన్నీ చదివాకా. జనవరి ఒకటి వరకూ వేచి ఉండటం చాలా కష్టం అని నాకే అనిపించింది. అలా ఉన్నాయి. ఆ పాయింట్లన్నీ కూడా.

కాలం ఆగలేదు కానీ, స్లోమోషన్‌లో చాలా భారంగా నడిచింది. ఆఖరికి ఎంతగానో ఎదురు చూసిన జనవరి ఒకటి రానే వచ్చింది. మా కంపెనీకి, జనవరి ఒకటి న్యూయియర్ అని సెలవు ఇవ్వాలి అన్న జ్ఞానం లేదు. అందుకని సెలవు ఇచ్చే ఆచారం పెట్టుకోలేదు. నేనే సెలవు పెట్టుకున్నాను.

తెల్లవారింది. నిన్నటి వరకూ కాఫీ నా దగ్గరికే వచ్చేది. ఇవాళ నుంచి నేను వేరు. డిఫరెంట్. నన్ను నేను మెరుగుపర్చుకుంటున్నాను. అందుకని నేనే కాఫీ దగ్గరికి అదే వంటింట్లోకి వెళ్ళి, కస్తూరి ఇచ్చే కాఫీ తెచ్చుకోవాలనుకున్నాను. వంటింటి గుమ్మం దగ్గర నుంచున్నాను. కస్తూరి సింక్ దగ్గర ఏదో పని చేసుకుంటోంది. మునివేళ్ళమీద నడిచి, కస్తూరిమెడమీద ముద్దుపెట్టుకున్నాను (చిన్న స్పర్శతో సహజమైన ప్రేమని చూపించి భార్య అభిమానానికి పాత్రులు కావచ్చు).

"అమ్మో!" అరిచి, గిరుక్కున వెనక్కి తిరిగింది. నన్ను చూశాక మొహంలోని భయం పోయి, చిరాకు చోటు చేసుకుంది.

"ఏఁవిటీ వెర్రి? హడలి చచ్చాను కదా!"

"నందివర్ధనంలా ముద్దుగా ఉన్న నీ మెడని చూసి ఆగలేకపోయాను" (ఇరవయి నాలుగు కారట్ల బంగారంతో తూగే కాంప్లిమెంటివ్వండి).

"హుఁ... ఏళ్ళు పైకెళ్తూంటే బుద్ధి వెనక్కి వెళ్తోంది. సిగ్గులేకపోతే సరి.

దూషణలు భూషణలుగా భావించాలి కాబట్టి పట్టించుకోకుండా కాఫీ గ్లాసు తీసుకుని డైనింగ్ టేబుల్ దగ్గర కూచున్నాను.

ఏడేళ్ళ నానిగాడు, వాడి పుట్టినరోజుకి ఎవరో ప్రెజెంట్ చేసిన ఓ వాచిని తెచ్చి, నా చేతిలో ఉంచాడు.

"ఏరా! ఇవాళ ఇంత పెందరాళే లేచావేం?" ఆశ్చర్యంగా అన్నా.

"స్కూలు లేదు కదా... డాడీ, వాచి ఎలా తిరుగుతుంది?" స్కూలుంటే తొందరగా లేవడన్నమాట. వీడికీ తెలివితేటలు ఎలా వచ్చాయి? నన్నుకుదిపాడు "డాడీ, వాచీ ఎలా తిరుగుతుంది?"

పాతరోజుల్లో అయితే మీ అమ్మనడుగు అనేవాడినేమో! ఇవాళ అలాకాదు (పిల్లల సందేహాలు ఓపిగ్గా తీర్చాలి. ఉత్సాహం చంపకూడదు).

కాఫీ గ్లాసుని ఓ పక్కగా ఉంచుతూ..."ఒరేయ్ ఓ తెల్లకాయితం, పెన్సిలూ, తేరా!"

"పెన్సిల్ లేదు. ఎక్కడో పోయింది..." అంటూ ఓ కాయితం తెచ్చాడు.

చర్రున కోపం వచ్చింది. కానీ తమాయించుకున్నాను. ఇవాళ నుంచి మారిపోవాలి (పిల్లల పరిస్థితిని అర్థం చేసుకోవాలి. వాళ్ళ కోణంలోంచి ఆలోచించాలి). నేనే నాలుగు చోట్ల వెతికి, పెన్సిల్ తెచ్చుకుని, పేపరు మీద బొమ్మ వేయడం మొదలెట్టాను. వాచి ఎలా తిరుగుతుందో వాడికి అర్థం అయ్యేలాగా చెప్పాలని నా తహతహ.

ఓ పది నిమిషాలు పట్టింది. బొమ్మ వేయడానికి. ఈ పదినిమిషాల్లో, వాడు ఓ పదిసార్లు పరిగెత్తుకుని వెళ్ళాడు ఏదో పనున్నట్లుగా. పదిసార్లు వాడిని పిలిచి పక్కన నుంచోపెట్టుకున్నాను. ఆఖరికి-

"ఇదిరా... ఇలా నడుస్తుంది... " అన్నాను.

"మరి నడవడం లేదు కదా డాడీ..."

నానిగాడి కన్నా మూడేళ్ళు పెద్దది చిట్టి, ఓ బొమ్మని చంకలో వేసుకుని, ఓ తువ్వాలుని కొంగులాగా నైట్‌గౌన్ మీద వేసుకుని ఓ పాత హాండ్ బ్యాగ్‌ని ఊపుకుంటూ వచ్చింది.

అంతా గమనించిందేమో, వాచీని టక్కున లాక్కుని, కీ ఇచ్చి వాడి చెవు దగ్గరుంచింది.

"అక్కకి తెలుసు వాచి ఎలా తిరుగుతుందో... " నన్నో వేస్టుగాడిని చూసినట్లు చూశాడు.

వాడి చూపుల్ని పట్టించుకోకుండా "హాపీ న్యూయియర్ చిట్టీ"

"హ్యాపీ ఏంటి? నిన్నటి నుంచి పాపకి జొరం..." (పిల్లల మనోభావాలు పట్టించుకోండి)

"అరెరె... డాక్టర్ నాని దగ్గరికి తీసుకెళ్ళకపోయావా! వాడి దగ్గర మొన్న పుట్టిన రోజు కొచ్చిన డాక్టర్ కిట్ ఉంది కదా! (పిల్లల భాషలోనే మాట్లాడ్డానికి ప్రయత్నించండి).

ఈ లోపల ఫోన్ మోగింది. ఇదివరకూ దాని ఛాయలకి కూడా వెళ్ళేవాడిని కాదు. అది మోగి మోగి ఆగాల్సిందే. లేకపోతే కస్తూరి వచ్చి తీయాల్సిందే. కానీ, నేను ఇవాళ మారిపోయాను కదా!

తీశాను. కస్తూరి ఫ్రెండ్ శ్వేత లైన్లో ఉంది.

"హాయ్ శ్వేతా! హ్యాపీ న్యూయియర్. బావున్నారా? సంక్రాంతి సెలవులకి ఎక్కడికైనా వెళ్తున్నారా? ఓహో! ఊరెళ్తున్నారన్నమాట. ఓ.కే. ఎంజాయ్... ఆc.. కస్తూరికిస్తున్నాను..." నిప్పులు కురిపిస్తూ నా పక్కనే ఉన్న కస్తూరికిచ్చాను ఫోను. ఆ చూపుల్ని మాటల్లోకి అనువాదించలేదు (ను) అక్కడి నుంచి కదిలి గదిలోకి వచ్చాను.

మంచం మీద నుంచుని, ఇద్దరూ జుట్లు పట్టుకుంటున్నారు. ఇదివరకూ కస్తూరిని పిలిచి, పిల్లల్ని మైక్ టైసన్ వారసులుగా పెంచుతున్నందుకు తిట్టేవాడిని. ఈ రోజు నేనే వీళ్ళ సంగతి చూస్తాను (పిల్లలతో సహనంగా, శాంతంగా మెలగడం నేర్చుకోవాలి).

నన్ను చూడగానే నానిగాడు గట్టిగా ఏడవడం మొదలెట్టాడు.

"ఏం జరిగిందమ్మా!" వాడిని దగ్గరికి తీసుకుని బుగ్గలు తుడిచాను.

"చిట్టెక్క పాపకి హార్ట్ ఎటాక్ అని చెప్పాను. కాదు... ఉట్టి జ్వరం అని చెప్పాలి అని కొడుతోంది. ఏం కాదు అని దాన్ని నేను కొట్టాను. జుట్టు పీకాను..."

"హార్ట్ ఎటాక్ అని ఎందుకు చెప్పాలి? నా పాప చచ్చిపోవాలనా!" అని అంటూనే వాడి నెత్తిమీద కొట్టింది.

ఇల్లు ఎగిరేట్లు అరిచాడు.

కస్తూరి పరుగు పరుగున వచ్చింది.

"పిల్లలిద్దరూ కొట్టుకుంటూంటే సినిమాలాగా చూస్తున్నారా! విడదీయక్కర్లేదా! ఏం మనిషి బాబూ!" అంటూ వాళ్ళిద్దర్ని మంచం దింపింది.

"వాడు నన్ను కొట్టి జుట్టు పీకేస్తూంటే, డాడి వాడిని ఏమీ అనలేదు. చూస్తూ ఉన్నారు మమ్మీ..." అంటూ నా మీద కంప్లెయింట్ చేసింది దుర్మార్గురాలు.

"ఉఁ... ఉఁ.. చూస్తారు చూస్తారు.. వాడితో నీకేమిటీ... నువ్వురా... ఏమిటి సెలవు పెట్టుకుని ఇంట్లో కూచుని వెర్రి చేష్టలు చేస్తున్నారు. ఆఫీసుకెళ్ళినా బావుండేది. ఇంట్లో శాంతి అయినా ఉండేది..." చిట్టిని లాక్కెళ్ళింది( మన పొరపాట్లని సిగ్గు పడకుండా స్వీకరించాలి).

"నానీ, దామ్మా మనిద్దరం ఏదైనా ఆడుకుందాం..." అంటూ వాడిని ఎత్తుకుని ముందు గదిలోకి వచ్చాను.

"స్నేక్స్ అండ్ లాడర్ ఆడదామా!" నా సమాధానం కోసం ఎదురు చూడకుండా, పాముల పటం తెచ్చాడు. టీ పాయిని జరిపి ఇద్దరం చెరో వైపున కూచున్నాం. నన్ను ఆడనీయకుండా వాడే ఆడుతున్నాడు. నేనోసారి ఆడితే, వాడు రెండు సార్లు ఆడుతున్నాడు. పామున్న గదిలో పడితే దిగడం లేదు. నిచ్చెన గడి నంబరు వచ్చేవరకూ గవ్వలు వేస్తూ ఉన్నాడు. నా ఛాన్స్ వచ్చినప్పుడు నేనాడాను. వెంటనే పెద్ద నిచ్చెన ఎక్కేశాను. 'చీట్ చేశావు, చీట్ చేశావు, నేనేం ఆడను' అంటూ టీపాయి ఒక్కసారి తోసి, నామీద పడి నా జుట్టు పీకాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో నా వ్యక్తిత్వ వికాసం పాయింట్లలో ఉందో లేదో నాకు తెలీదు.

మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కిసట్లు, నన్నుకొట్టి వాడు ఏడుస్తూ వెళ్ళి కస్తూరికి ఏదో చెప్తున్నాడు. కస్తూరికి భయపడి వీధిలోకి అడుగు పెట్టాను. మార్నింగ్ వాక్ అయ్యి గూడు చేరుకుంటున్న పక్షులకు హ్యాపీ న్యూ ఇయర్ చెప్పి ఇల్లు చేరాను. ఓ అరగంట తర్వాత (అందర్నీ నవ్వుతూ పలుకరించాలి. విష్ చేయాలి).

వంటింట్లోకి వెళ్ళాను. కస్తూరికి పాపం ఏమైనా సాయం చేద్దామని (భార్య పని భారాన్ని పంచుకోవాలి. ముఖ్యంగా పొద్దున సమయంలో).

వంట గట్టుని తుడుస్తోంది. వెనకగా నుంచుని ఆమె భుజంమీద చేయి వేశాను. వెనక్కి తిరిగింది.

"నా కేమయినా పని చెప్పకూడదూ, పాపం అంతా నువ్వే చేసుకుంటున్నావని అంటే వింతగా చూసింది మరి ఆమెకిది ఎనిమిదో వింత.

ఓ సారి తల ఎగరేసి, 'హం' అంటూ వెళ్ళిపోయింది.

ఏం చేయాలో తెలీలేదు. బ్రేక్ ఫాస్ట్ కేమయినా ఉందా అని గ్లాసు పొయ్యి మీద, పక్కనా, కిందా అంతా వెతికాను. ఏమీ కనపళ్ళేదు. కొంచెం ఎడంగా ఎ గిన్నె కనపడింది. మూత తీసి చూశాను. ఇడ్లీ పిండి. ఓహో ఇవాళ ఇడ్లీలన్నమాట. కస్తూరి కోసం చూశాను. బాత్రూం తలుపులు వేసి ఉన్నాయి. నీళ్ళ శబ్దం వస్తోంది. స్నానం చేస్తోంది. ఆమె వచ్చే లోపలే ఇడ్లీలు పెట్టేస్తే పాపం కస్తూరికి ఓ పని తప్పుతుంది.

ఇడ్లీస్టాండ్ కోసం వెతికాను. ఎక్కడా కనపళ్ళేదు. అదేమీ ఓ చిన్న ప్లేటు కాదు కదా, ఎక్కడో అడుగున ఉండిపోయిందనుకోవడానికి. కస్తూరి చాలా గ్రేట్. దాన్ని ఎక్కడ దాచిందో!

ఈ లోపల చిట్టి తువ్వాల్ని భుజాన సవరించుకుంటూ ఓ బొమ్మని ఈడ్చుకుంటూ "మమ్మీ!" అంటూ వచ్చింది.

"అమ్మడూ, చిట్టీ, ఇడ్లీలు పెట్టే స్టాండ్ ఎక్కడుందో తెలుసా?"

నన్నోసారి చూసి, గాసుకింద ఉన్న అరలోంచి స్టాండుని తీసింది. గ్రేట్. ఇందాకా నాకు కనపడనిది దానికి కనపడింది. నా కెందుకు కనపల్లేదు? దానికెలా కనపడింది? నాకేమయినా దృష్టిలోపం ఉందా?

పిండిని గరిటతో కలిపి, స్టాండ్‌లో పిండిని పోసి, దాన్ని కుక్కర్‌లో పెట్టి, కుక్కర్ మూత మూసి వెనక్కి తిరిగేప్పటికి, గుమ్మం దగ్గర నుంచుని ఉంది కస్తూరి. పరికిణి, జాకెట్టు, దానిమీద చీరని ఓణీలాగా చుట్టుకుంది.

"వంటింట్లో ఏం చేస్తున్నారు? కుక్కర్‌లో ఏం పెట్టారు?" ఆశ్చర్యంగా అంది.

"హమ్మయ్య, కుక్కర్ పెట్టేశారా! ఓ పని తప్పింది" సంతోషం నిండిన ఆమె గొంతులోంచి వచ్చే మాటలకోసం ఎదురుచూస్తూ "ఇడ్లీలు" అన్నాను.

"ఇడ్లీలా! ఆ పిండి తీశారా! మీరెక్కడ దొరికారండీ? అది రాత్రి కోసం అని ఇప్పుడే పిండి రుబ్బి పెట్టాను. ఇడ్లీలు పెట్టమని నేనేమయినా మీకు చెప్పానా? లేదు కదా! మరి ఎందుకు పెట్టారు? ఇవాళ ఇలా పోలిగాడు, గందోళిగాడు నెత్తిమీద కూచున్నట్లుగా పిచ్చిగా తయారయ్యారేం? ఓ చోట కూచోకుండా... అయినా ఇవాళ సెలవు పెట్టి ఇంట్లో కూచున్నది మమ్మల్ని తినడానికా!"

సమాధానం దొరకక అయోమయంలో ఉన్నాను.

"ఇందాకా మీరేఁవిటీ ఆ శ్వేతతో అలా మాట్లాడారు? మీకేమీ పెద్దగా పరిచయం కూడా లేదే?...."

"అదా!... కొత్త సంవత్సరం కదా, అని... అయినా నీ ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు, సరదాకి..."

అసహ్యంగా చూసింది.

"సరదా ఏఁవిటి? నా ఫ్రెండ్‌తో సరదాలేఁవిటి? ఇంతకు ముందు లేదేం ఈ సరదాలు! హఠాత్తుగా ఇవాళే ఎలా పుట్టుకొచ్చాయి, తోసినంత పనిచేసి బధాలున తలుపు వేసింది.

కాళ్ళీడ్చుకుంటూ వచ్చి సోఫాలో కూచున్నా టీవి చూద్దామని. నానీ, చిట్టి చాలా సఖ్యంగా, నవ్వుతూ కార్టూన్లు చూస్తున్నారు.. గబుక్కున రిమోట్ లాక్కుని ఛానెల్ మార్చాను.

"అమ్మా!" అంటూ గట్టిగా అరిచారు.

వెంటనే కస్తూరి ప్రత్యక్షం అయింది. నేనేదో పిల్లల్ని చంపేస్తున్నానేమో అన్న ఎక్స్‌ప్రెషన్‌తో...

ఛ! వీళ్లకోసం ఓ పది పుస్తకాలు రీసెర్చి చేశాను. నన్ను నేను మార్చుకుందామని విలువలేని రీసెర్చి.

"చదువుకోండి... అస్తమానం టీవియేనా! లేకపోతే ఆడుకోండి. టీవిని నేను చూస్తాను. నా ఇష్టం వచ్చిన ఛానెల్ చూస్తాను. నన్ను నేను ఇంప్రూవ్ చేసుకుందామనుకుని పొద్దుట్నించి ప్రయత్నం చేస్తున్నా! ఛీ మీకో మంచి తండ్రి, ఓ మంచి భర్త అక్కర్లేదు. మీరు దానికి తగిన వారు కారు. ఏం అలా దీపం సెమ్మలా నుంచున్నావ్? ఫో! పోయి కాఫీ తీసుకురా..." అంటూ టీవి వైపు మొహం తిప్పాను.

*సుజనరంజని సిలికానాంధ్ర, 2008*

❖